క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: మేష సంక్రమణాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం తిరువీధి విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అలంకరించి పల్లకీలో అధిష్టంపజేసి సింహగిరి మాడ వీధుల్లో సాయంత్రం తిరువీధి వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు.

లలితాంబిక సన్నిధిలో సిరిజ్యోతి పూజ



సిరిజ్యోతి పూజలో పాల్గొన్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని రాజరాజేశ్వరీ ఆరాధన పీఠంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. 6వ రోజు ఆదివారం స్కందజనని,సత్సంతాన ప్రాప్తి కారిణిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.గురుమాత అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో లలితా మూలమంత్ర సుబ్రహ్మణ్య సహిత ఖడ్గమాల వహనం చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సంధ్యా సమయంలో సిరిజ్యోతి పూజ నిర్వహించారు.

17న సింహగిరిపై శ్రీరామనవమి వేడుకలు

సింహాచలం: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈనెల 17న సింహగిరిపై గంగధార వద్ద ఉన్న పురాతన రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని చెప్పారు. భక్తులు, అడవివరం గ్రామస్తులు ఈ వేడుకలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అయ్యప్పస్వామికి ఘనంగా విషు పూజ



పూజలందుకున్న అయ్యప్పస్వామి

పెందుర్తి: కేరళలో ఉగాదిని పురస్కరించుకుని సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం విషు పూజ ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృతాభిషేకాలు జరిపారు. విశేష అలంకరణ చేసి బియ్యం, నాణేలతో అభిషేకాలు చేశారు. అయ్యప్పకు దూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బొగ్గులారీ బోల్తా



కెనరా బ్యాంకు వద్ద బోల్తాపడిన బొగ్గు లారీ

పరవాడ: లంకెలపాలెం మీదుగా హిందూజా పవర్ ప్రాజెక్టుకు బొగ్గు తీసుకువెళుతున్న ఓ లారీ ఆదివారం పరవాడ కెనరా బ్యాంకు వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్ చాకచక్యంగా ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. బొగ్గు లారీ బోల్తాపడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సాయంత్రానికి బోల్తా పడిన లారీని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ సురేష్ చెప్పారు.

జగన్‌తోనే సంక్షేమం



భర్నికంలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న అదీప్‌రాజ్



అదీప్‌రాజ్‌కు హారతులిచ్చి పుష్పవర్షం కురిపించి స్వాగతం పలికిన మహిళలు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం

పరవాడ: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే, పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని భర్నికం, తిక్కవానిపాలెం, తానాం గ్రామాలతో పాటు శివారు గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం సాగించారు. భర్నికంలో అదీప్‌రాజ్‌కు సర్పంచ్ పెదిశెట్టి పూజా శేఖర్ ఆధ్వర్యంలో ప్రజలు హారతులిచ్చి పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. తిక్కవానిపాలెంలో అదీప్‌రాజ్‌కు మత్స్యకారుల నుంచి అఖండ స్వాగతం లభించింది. తానాంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు ఆధ్వర్యంలో అదీప్‌రాజ్‌కు మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. బాపడుపాలెం, కట్టవానిపాలెం, తిక్కవానిపాలెం, తానాం గ్రామాల్లో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రజలను నేరుగా కలిసి ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని అభ్యర్థించారు.

అభివృద్ధి చేసి చూపిస్తా..

అనంతరం అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనకు మరో అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భర్నికంలో అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.12.68 కోట్లు వెచ్చించినట్టు చెప్పారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చడం జరిగిందన్నారు. చంద్రబాబు దొంగ హామీలిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై రాళ్లదాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఎంతగా దిగజారిపోతున్నాయో ఈ సంఘటన బట్టి తెలుస్తోందన్నారు. జగనన్నకు ప్రజల నుంచి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అక్కసుతో శాడిస్టులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ ఎన్ని రాజకీయ పార్టీలతో పొత్తులు పెట్టుకుంటే.. వైఎస్సార్‌సీపీ మాత్రం ప్రజలతోనే పొత్తు పెట్టుకుంటుందన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుయుక్తులకు పాల్పడినా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైలపూడి భగవాన్ జైరామ్, గండి రవికుమార్, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, నాయకులు గొర్లి గోపి, సన్యాసిరావు, పైల సత్యనారాయణ, చరణ్‌రాజ్, పైల రేగారావు, బొంది అచ్చిబాబు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాలకు చెక్



అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఫైర్ ఆఫీసర్ సత్యరాజు

సబ్బవరం: పలు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని సబ్బవరం అగ్నిమాపక కేంద్రం అధికారి జీవీ సత్యరాజు అన్నారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. విధి నిర్వహణలో అమరులైన సిబ్బంది చిచ్చు యాదవ్,రంజిత్, సతీష్, తరుణ్‌కు నివాళులర్పించారు.అనంతరం విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

వైఎస్సార్‌సీపీకి అడవివరం యువత మద్దతు



ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో అడవివరం యువత

సింహాచలం: వైఎస్సార్‌సీపీకి అడవివరానికి చెందిన యువత మద్దతు తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. వారందరికీ ముత్తంశెట్టి పార్టీ కండు వాలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అడవివరంలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు స్టార్ క్యాంపైనర్లుగా పనిచేస్తామని ఈ సందర్భంగా యువత తెలిపారు. ముత్తంశెట్టి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలను ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం ఆధ్వర్యంలో యువత దిలీప్‌రెడ్డి, అశోక్, కుంది సురేష్, రామిరెడ్డి, దినేష్‌రెడ్డి, సతీష్, కిట్టు, అప్పలరాజు, గణేష్, సాయు, రాజేష్, విశ్వనాథ్, సురేష్, జన, భాను, మధు, సతీష్, సత్యనారాయణ, నర్సింగ్, మహేష్, పవన్, కుమార్, కె.పవన్, సతీష్, అంజి, సురేష్ మజ్జి, నాయుడు, మౌళి, దైత్యానంద్, వరహాలు, శ్యామ్, వంశీ, అరుణ్ తదితరులు ముత్తంశెట్టిని కలిసిన వారిలో ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ రమణ, సర్పంచ్ ప్రసాదరావు

సబ్బవరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ పిన్నింటి రమణ, సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, వాసవీ సంఘం ప్రతినిధి కొప్పాక శేషు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ రమణ మాట్లాడుతూ మండు వేసవిలో సుదూర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే వారికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. తొలి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రసాదరావు మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆర్య వైశ్య సంఘాలు పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్బవరం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ పాలకవర్గ అధ్యక్షుడు బి. వెంకటరామారావు, డి. అయ్యప్ప, సంతోష్ గుప్తా, ఆర్య వైశ్యులు దంగేటి నాగేశ్వరరావు, పెన్నం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు అంబేడ్కర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను పెందుర్తి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లోని అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మొగలిపురంలో డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గండి రవికుమార్, ఐడి బాబు తదితరులు



చినయాతపాలెంలో డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పాలిశెట్టి సురేష్ రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు చిన యాతపాలెం ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌పీ రాజు,బాలాజీ,బండారు రమణ,దెడ్డం అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

- మొగలిపురంలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.రాంజీ అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర దళిత బహుజన అధ్యక్షుడు ఐడీ బాబు, నాయకులు డి. ఈశ్వరరావు,ఐ. గోపి,అప్పలరాజు,బత్తిన వెంకట రమణ,జి. సత్యనారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నగర్‌లో..

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు అడవివరం దరి అంబేడ్కర్‌నగర్‌లో నవదళిత యువ సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నవదళిత యువ సేవాసంఘం అధ్యక్షుడు మునపర్తి శివ, ఉపాధ్యక్షులు నక్కిడాపు చంటి, వంగలపూడి రమణ, కార్యదర్శి గొడ్డు ఎర్రిబాబు, వైస్ కార్యదర్శి కింతాడ హరి, కోశాధికారి అడవివరపు బంగారుబాబు, పెదపూడి ఆనంద్, నివాసితులు వంగలపూడి అప్పారావు, కింతాడ శ్రీను, గంట్యాడ చిట్టిబాబు, వంగలపూడి శంకర్, పట్టా దివాకర్, కింతాడ రాజు, అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.

- సింహాచలం దేవస్థానం కొండదిగువ పరిపాలన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పూలమాలవేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్ విశేష కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో రమణమూర్తి, ఏఈ బాబ్జి, అర్చకులు, వేద పండితులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వెన్నలపాలెంలో..

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ చిత్రపటానికి అనకాపల్లి జిల్లా దళిత సేన ప్రధాన కార్యదర్శి ఈతలపాక అప్పలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నవదళిత యువ సేవా సంఘం నాయకులు



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి



వెన్నలపాలెం ఎస్సీ కాలనీలో ..

రయ్.. రయ్

- అద్దంలా రహదారులు
- ప్రయాణ కష్టాలకు చెక్

పెందుర్తి నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం, మరమ్మతులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. దశాబ్దాలుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరమగీతం పాడారు. ప్రధాన రహదారులతో పాటు గ్రామాలు, కాలనీలను అనుసంధానం చేస్తున్న రోడ్లను రాచమార్గాలుగా తీర్చిదిద్దారు. పెందుర్తి-సబ్బవరం-అనకాపల్లి ప్రధాన రహదారి సహా ఇటు గ్రామీణ, అటు పట్టణ ప్రాంతాల్లో రహదారులకు మెరుగులు దిద్దారు. ఎక్కడికక్కడ రోడ్లను సుందరంగా ముస్తాబు చేశారు. ఆయా రోడ్లపై ప్రజలు హాయిగా ప్రయాణం చేస్తున్నారు.

- పెందుర్తి



ముస్తాబైన పినగాడి వయా గొరపల్లి-గుల్లేపల్లి రోడ్డు



సుందరంగా సుజాతనగర్ రహదారి



సువిశాలంగా పెందుర్తి-సబ్బవరం-అనకాపల్లి ప్రధాన రహదారి



విశాలంగా పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు

పాలిసెట్ మోడల్ పరీక్షకు స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని గాలిభీమవరం ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం మోడల్ పాలిసెట్-2024 పరీక్ష నిర్వహించారు.ఈ నెల 27న నిర్వహించే పాలిసెట్-2024కు విద్యార్థులు సమాయత్తం కావడంతో పరీక్ష ఎలా రాయాలో అవగాహన కోసం ఈ పరీక్ష నిర్వహించారు. 250 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు.

13 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన సూరాడ సత్తెయ్య 13 మద్యం సీసాలను తరలిస్తుండగా పరవాడ ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

కొనసాగుతున్న గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన

పెదగంట్యాడ : తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు గంగవరం పోర్టు ఒప్పంద కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆదివారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గంగవరం పోర్టు యాజమాన్యం తమను నిర్లక్ష్యంగా చూస్తోందన్నారు. వేతనాలు పెంచమని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలన్నారు. కార్మికులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో గంగవరం పోర్టు యాజమాన్యం కక్ష సాధింపులకు దిగుతోందని వారు చెప్పారు. ఇక్కడ కార్మికులు తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేశారని ఆరోపించారు.

ఉక్కు అంతర విభాగం క్రికెట్ పోటీల విజేత బ్లాస్ట్‌ఫర్నేస్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అంతర విభాగం క్రికెట్ పోటీల విజేతగా బ్లాస్ట్‌ఫర్నేస్ జట్టు గెలుపొందింది. ఆదివారం ఉక్కు స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తొలి బ్యాటింగ్‌కు దిగిన కోక్‌ఓవెన్స్ జట్టు 20 ఓవర్లలో 123 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యసాధనకు బరిలోకి వచ్చిన బ్లాస్ట్‌ఫర్నేస్ జట్టు 18 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 124 పరుగులతో విజేతగా నిలిచింది. విజేత జట్టుకు చెందిన సిహెచ్. శ్రీనివాస్ 70 పరుగులు చేసి నాటౌట్‌గా నిలువగా బౌలింగ్ చేసిన నరసింహ, అనీల్‌లకు చెరో మూడు వికెట్లు, నరేష్‌కు రెండు వికెట్లు తీశారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి సీజీఎం మహంతి, జీఎం నాగ్, కృష్ణారావు, కార్మిక నాయకులు పి.వి. నగేష్, అప్పారావులు హాజరై కెప్టెన్ బి.వి. రమణ, జట్టు క్రీడాకారులను అభినందించారు.

స్టీల్‌ప్లాంట్‌లో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ బాగ్చీ, కమాండెంట్ హనీఫ్, అతిథులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఆదివారం జాతీయ అగ్ని మాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. సీఐఎస్‌ఎఫ్ ఫైర్ వింగ్ ఆధ్వర్యంలో ప్లాంట్‌లోని ఫైర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన వారోత్సవాలను స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె.బాగ్చీ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. స్టీల్‌ప్లాంట్ యంత్రాలు, పనిముట్లు రక్షణలో ఫైర్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా డైరెక్టర్లు బాగ్చీ, గణేష్, సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్, ఉప కమాండెంట్ నవీన్‌కుమార్‌లు సీఐఎస్‌ఎఫ్ ఫైర్ వింగ్‌కు చెందిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వారోత్సవాల్లో వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 20న జరగనున్న ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ అధికారులు, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.